క్లుప్తంగా

శ్రీ మఠంలో భక్తుల రద్దీ


ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం : శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక,తమిళనాడు, కేరళ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో మఠం పరిసరాలు రద్దీగా మారా యి. పీఠాధిపతి శ్రీ సుభుదేంద్ర తీర్థుల ఆశీస్సు లతో మూలబృందావనంకు వేకువజామునుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథాలపై ఊరేగించారు.

విద్యాధికారులపై చర్యలు తీసుకోండి

ఆదోని సెంట్రల్: కార్పోరేట్,ప్రైవేట్ పాఠశాలలకు తొత్తులుగా మారి నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న విద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అఖండ, డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున కోరారు. భీమాస్ కూడలిలో ఆదివారం నిరసన వ్యక్తం చేసి దిష్టిబొమ్మ దహనం చేశారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్,కార్పోరేట్ పాఠశాలలను వసతులు లేని అద్దె భవనాల్లో నడుపుతున్న పట్టించుకోవడం లేదన్నారు. ఫీజులకు సంబందించిన వివరాలను నోటీసు బోర్డులో పెట్టకుండా వేలకు వేలు వసులు చేస్తున్నారని మండిపడ్డారు. వాటిని నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చుస్తున్నారని తెలిపారు. నాయకులు రసూల్, మహేష్,హరి, చిన్న, సునీల్,నగేష్ పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ పూజారులు మహేశ్ స్వామి, మల్లప్ప స్వామి స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, భండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నివేదన, నిరాజన తదితర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ఆస్పరి మఠంలో భక్తులకు అన్నదానం చేశారు.

సిద్ధప్పతాత మఠంలో పనులు

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో వెలిసిన కోడేకల్ సిద్ధప్పతాత మఠంలో ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహకారంతో పెద్దతుంబళం కాంట్రాక్టర్ బసవరాజు ఆదివారం కాంక్రీట్ సిమెంట్ బెడ్ వేశారు. ఈ మేరకు ఆయనను సిబ్బంది సన్మా నించారు. బసవరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మఠంలో కాంక్రీట్ బెడ్ వేశామన్నారు. అలాగే శిశువు బృందానికి రెండు గదులను ఉచితంగా కట్టి ఇచ్చామని, అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు.

30 నుంచి వరుణయాగ పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 30 నుంచి జూన్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు వరుణయాగ పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మతగేరి తిప్పెట రామిరెడ్డి ఆదివారం తెలిపారు. బెల్దోణ రామశాస్త్రి ఆధ్వర్యంలో వరుణయాగ పూజలు నిర్వహిస్తారని, ఇందుకోసం ఆలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు పాడి పశువులతో సుఖంగా ఉండాలని అలాగే సమాజ శ్రేయస్సు కోసం వరుణయాగం, కుంభోత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు రామిరెడ్డి తెలిపారు. భక్తులు పాల్గొని దేవుడి ఆశీస్సులు పొందాలన్నారు.

భగవద్గీత మానవ జీవనానికి దిక్సూచి

కర్నూలు కల్చరల్: భగవద్గీత మానవ జీవనానికి దిక్సూచి అని ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ ప్రతి ఒక్కరు భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. జీవన ఉన్నతికి ఉత్తమ జీవన విధానానికి ఇది ఉపయోగ పడుతుందన్నారు.

పోషకాలు.. ఆరోగ్యం

- రుచికరంగా 'జగనన్న గోరుముద్ద'
- రోజుకో వంటకంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- వారంలో మూడు రోజులు రాగి జావ పంపిణీ
- మెనూ ప్రకారం వంటలు
- చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్‌ల నివారణకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకాన్ని తీసుకొచ్చింది. అయితే గతంలో నిర్వహణ, పర్యవేక్షణ, చిత్తశుద్ధి లోపం కారణంగా విద్యార్థులకు సరైన ఆహారం అందేది కాదు. దీంతో పథకం నిర్వహణ గందరగోళంగా మారడమే కాకుండా లక్ష్యం నెరవేరలేదు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళించారు. ఇందులో భాగంగా జగనన్న గోరుముద్ద కింద మధ్యాహ్న భోజనానికి కొత్త రూపు తీసుకొచ్చారు. మెనూ కచ్చితంగా పాటించడమే కాకుండా నాణ్యమైన ఆహారంతో పాటు చిక్కీలు, రాగిజావ, గుడ్డు అందజేస్తుండటంతో విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు పోషకాలు అందుతున్నాయి.


కోసిగి బాలికల పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు (ఫైల్)

కోసిగి: వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా బడులను రూపుదిద్దడంతో పాటు మధ్యాహ్న భోజనం విషయంపై ప్రత్యేక దృష్టి సారించింది. నిధులు వెచ్చిస్తున్నా డ్రాపౌట్‌లు తగ్గక పోవడం, విద్యార్థులు తరచూ అనారోగ్యాల బారిన పడటం, తల్లిదండ్రులు సర్కారు బడులకు పంపేందుకు విముఖంగా ఉండటానికి గల ప్రధాన కారణాల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా లేకపోవడమేనని గ్రహించి మార్పులకు శ్రీకారం చుట్టింది.నాణ్యమైన, బలవర్ధకమైన ఆహారం అందిస్తే ఆరోగ్యకరమైన సమాజం లభిస్తుందని భావించారు. పేదవిద్యార్థుల తల్లిదండ్రులకు భారం కాకుండా ప్రభుత్వమే ఏటా కోట్లాది రూపాయలు వెచ్చించి జగనన్న గోరుముద్ద పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం అందజేస్తున్న మధ్యాహ్న భోజనంలో చిన్నారులకు పోషక విలువలతో పాటు గుడ్డు, చిక్కీ, రాగి జావ, కూరగాయలు, ఆకు కూరలతో కూడిన ఆహారాన్ని మరింత రుచికరంగా అందజేస్తున్నారు. గతంలో వారంలో మూడు రోజులు మాత్రమే గుడ్డు ఇచ్చేవారు. జగనన్న వచ్చిన తరువాత ఉడికించిన గుడ్డ రోజూ ఇస్తున్నారు.


పాఠశాలలో తయారు చేసిన రాగి జావ

పథకం అమలు ఇలా..

మంత్రాలయం నియోజకవర్గంలో ప్రభుత్వం పిల్లల కోసం రోజు వారీగా 1–5వ తరగతి విద్యార్థులకు 100 గ్రాములు, 6 – 10వ తరగతి 150 గ్రాముల అన్నం, వంట ఏజెన్సీలకు మెనూ ప్రకారం వడ్డించేందుకు గుడ్డు సరఫరా కాదని, ఆకు, కూరగాయల నిమిత్తం 1 – 5వ తరగతి విద్యార్థులు ఒక్కో విద్యార్థికి రూ.5.87, 6 –10వ తరగతి విద్యార్థికి రూ.8.58 చొప్పున ఖర్చు చేస్తోంది. ఇలా విద్యార్థులకు వంట వండేందుకు ఏజెన్సీలకు ఒక్కొక్కరికి నెలకు ప్రభుత్వం రూ.3వేల వేతనం అందజేస్తుంది.

మండలాల వారీగా విద్యార్థులు..					
మండలం	ప్రాథమిక	ప్రాథమికోన్నత	హైస్కూల్	మొత్తం	పిల్లలు
కోసిగి	33	2	14	49	13,506
మంత్రాలయం	33	4	10	47	11,346
కౌతాళం	39	7	12	59	14,609
పెద్దకడబూరు	28	7	8	43	10,711
మొత్తం	133	20	44	198	50,172


రాగి జావను తాగుతున్న చిన్నారులు

బలానికి రాగి జావ

చదువుకునే చిన్న పిల్లకు పౌష్టికాహారం అందజేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఏడాది నుంచిరాగి జావను అందిస్తున్నారు. వారంలో మూడు రోజుల పాటు (మంగళ, గురు, శనివారాల్లో) రాగి ఇస్తున్నారు. పాఠశాలకు వచ్చిన వెంటనే ఉదయం 9 గంటలకే గ్లాసులో రాగి జావ అందిస్తున్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం పాఠశాలలకు రాగి పిండి, బెల్లం సరఫరా చేస్తోంది. దీంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న గోరుముద్ద మెనూ..

సోమవారం – వెజ్ పలావు, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం – పులిహోర, దొండకాయ చెట్నీ, గుడ్డు
బుధవారం – వెజ్ బిర్యానీ, బంగాళదుంప కూర, గుడ్డు, చిక్కీ
గురువారం – లెమన్ రైస్, టమాటా చెట్నీ, గుడ్డు
శుక్రవారం – అన్నం, పప్పు, ఆకుకూర, గుడ్డు, చిక్కీ
శనివారం – ఆకుకూరతో తయారు చేసి అన్నం, స్వీట్ పొంగల్

మధ్యాహ్న భోజనం చాలా బాగుంది



పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చాలా బాగుంది. రోజూ అన్నం, గుడ్డు, చిక్కీ ఇస్తున్నారు. గతంలో కంటే ఇప్పుడే బాగుంటోంది. పాఠశాలలో కుర్చీలు, టేబుళ్లు, విశాలమైన గదులు, ఆడుకునే స్థలం, గోడలపై అందమైన పెద్ద బొమ్మలు వేశారు. ఇప్పుడు చాలా బాగుంది.
– కవిత, 5వ తరగతి

రాగి జావా ఇస్తున్నారు



వారం రోజుల్లో మూడు రోజులు పాఠశాలకు వచ్చిన వెంటనే ప్రార్థన చేసిన తర్వాత రాగి జావ అందిస్తున్నారు. పాఠశాలలో ఉన్న గ్లాసులలో వేసి ఇస్తారు. చాలా బాగుంటుంది. గతంలో వంట కూడా ఇలా ఉండేది కాదు. దీంతో పాటు చిక్కీ, గుడ్డు, అన్నం, ఆకు, కూరగాయల పప్పు పెడుతున్నారు. రుచికరంగా ఉంటుంది.
– వైష్ణవి, 5వ తరగతి

జగనన్న గోరుముద్ద పకడ్బందీగా అమలు చేస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దను పకడ్బందీగా అమలు జరిగేలా చూస్తున్నాం. రోజు వారీగా పాఠశాలకు వచ్చిన వెంటనే మూడు రోజుల పాటు 9గంటలకు రాగి జావ అందిస్తున్నాం. ప్రతి పాఠశాలలో మెనూ ప్రకారం వంటలు చేసేలా ప్రధానోపాధ్యాయులు, పీఎంసీ చైర్మెన్‌లకు సూచనలిచ్చాం. ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీలు చేస్తున్నాం. ముఖ్యంగా ఎంత మంది విద్యార్థులు తిన్నారో వివరాలను ఎప్పిటికప్పుడు నమోదు చేయిస్తున్నాం. భోజనం సరిగా లేకపోతే మార్పులు చేయిస్తున్నాం. ముఖ్యంగా నాణ్యమైన, పౌష్టికాహారం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారు.
– మొయినుద్దీన్, ఎంఈఓ

ఈ ఏడాది నుంచే డిగ్రీ తరగతులు


విద్యార్థి తండ్రితో మాట్లాడుతున్న కళాశాల సిబ్బంది

- ఇచ్చిన హామీ మేరకు ఆదోనికి డిగ్రీ కళాశాల మంజూరు
- ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు జూలై 5 వరకు అవకాశం
- నెరవేరిన ఆదోని వాసుల కల

ఆదోని సెంట్రల్: నియోజకవర్గంలోని పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఆదోనిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు గతేడాది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరారు. అందుకు సీఎం స్పందించి కళాశాల ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు కళాశాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో అధికారులు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోనే డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థులకు కళాశాల సిబ్బందితో రిజిష్టర్ చేసుకొనేందుకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రోజు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఏ ఏ కోర్సులు ఉన్నాయి. ఏ కోర్సులో చేర్పించాలనే విషయాలను అడిగి తెలుసుకుంటున్నారు.

అందుబాటులోనున్న కోర్సులు..

గతంలో ప్రకటించిన కోర్సులను కాకుండా ప్రభుత్వం రివైజ్ చేస్తూ వివిధ కోర్సులు ప్రవేశ పెట్టింది. సింగల్ మేజర్ యూజీ ప్రాగ్రాం కింద డిగ్రీ హానరబుల్ కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. డిగ్రీలో స్పెషలైజేషన్ సబ్జెక్టు కింద విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా కోర్సులను రూపొందించారు. ఈ ఏడాది డిగ్రీ కళాశాలలో బీఏ ఎకానమిక్స్‌లో 40 సీట్లు, బీకాం జనరల్‌లో 60 సీట్లు, బీఎస్సీ బోటనీలో 40 సీట్లను ప్రభుత్వం కేటాయించింది. అయా కోర్సులలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిష్టర్ చేసుకోవడానికి జూలై 5 వరకు గడువుంది. 5న రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు జూలై 7 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. అదే నెల 16న సీట్ల అలాట్‌మెంటును అయా కళాశాలలకు కేటాయిస్తారు.

సిబ్బందిని ఏర్పాటు చేసే దశగా సన్నహాలు

నూతన డిగ్రీ కళాశాలకు ఎమ్మిగనూరు మహయోగి లక్ష్మమ్మవ్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. విద్యార్థులను కళాశాలలో చేర్పించేందుకు నాన్ టీచింగ్ సిబ్బందిని కూడా సర్దుబాటు చేశారు. కళాశాలలో విద్యార్థులు చేరే సంఖ్య, కోర్సులను బట్టి అధ్యాపకులను నియమించేందుకు, అవసరమైతే ఫ్యాకల్టీ నియమించే దిశగా అడుగులు వేస్తున్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం సంతోషం




ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తయ్యింది. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో చేరే స్థోమత లేదు. ఎక్కడ చేరాలో తెలియక ఆందోళనలో ఉన్నాను. ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. మధ్యలో చదువు ఆపకుండా మాలాంటి వారికి కళాశాల ఏర్పాటు ఎంతగానో ఉపయోగపడుతుంది. – అశ్విని, విద్యార్థిని ఆదోని

పేద విద్యార్థులకు మంచి అవకాశం



కళాశాలలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూలై 5వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ప్రభుత్వం పొడిగించింది. కళాశాల ఎంపిక కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. విద్యార్థులు గమనించి కళాశాలను ఎంపిక చేసుకోవాలి. కళాశాలలో అధ్యాపకులతో పాటు అన్ని వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాము.
– మహబూబ్ బాషా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

సమాచారం చెప్పేదెవరో?



అధికారుల పేర్లు లేకుండా ఖాళీగా ఉన్న సమాచార హక్కు చట్టం బోర్డు

చిప్పగిరి: మండలంలోని ప్రజలు ప్రభుత్వ శాఖల సేవలకు సంబంధించిన సమాచారం కావాలంటే ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, సూపరింటెండెంట్ తదితర అధికారులు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఎంపీడీఓగా సీవీ కొండయ్య, సూపరింటెండెంట్‌గా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. ఈఓపీఆర్డీగా సంజన్న గతం నుంచే కొనసాగుతున్నారు. అయితే సమాచార హక్కు చట్టం బోర్డులో వారి పేర్లేవి కనబడక ఖాళీగా దర్శనమిస్తోంది. దీంతో వివిధ సమాచారం కావాల్సిన వారు ఎవరిని సంప్రదించాలో తెలియక వెనుదిరిగి పోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు వారి ఫోన్ నంబర్లు ప్రదర్శించాలని కోరుతున్నారు.

చిరుత జాడపై అన్వేషణ

కృష్ణగిరి: కోయిలకొండ గ్రామ సమీపంలోని కొండల్లో చిరుత సంచరిస్తున్నట్లు మేకల కాపర్లు గుర్తించారు. శనివారం సాయంత్రం మందలోని ఓ మేకపై చిరుత దాడి చేయగా గుమనించిన కాపర్లు రాళ్లు విసరడంతో పరారైనట్లు కాపరి కృష్ణ తెలిపారు. విషయం తెలుసుకున్న డోన్ ఫారెస్టు బీట్ అధికారి కాళిదాసు ఆదివారం గ్రామానికి చెరుకుని నల్లకొండ ప్రాంతాన్ని పరిశీలించారు.అక్కడ చిరుత చంపి తిన్న జంతువుల ఎముకలను గుర్తించారు. అలాగే చిరుత దాడి చేసిన మేకను పరిశీలించారు.

వెన్నెల వాన పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

పెద్దకడబూరు: మండలంలోని కంబదహాళ్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్య వేత్త, బాలబంధు గద్వాల సోమన్న కొత్తగా రచించిన వెన్నెల వాన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో అంతర్జాతీయ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కర్నూలు జిల్లా కన్జూమర్ ఫోరం జడ్జి నరహరి నారాయణ రెడ్డి చేతుల వెన్నెల వాన పుస్తకావిస్కరణ చేశారు. కన్నడ- తెలుగు కవితా గోష్టి కవితాగానం అనంతరం బాలసాహిత్యవేత్త సోమన్న సత్కరించారు. కేశవయ్య, నాగేశ్వర రావు, కవులు పాల్గొన్నారు. సోమన్నను తోటి ఉపాధ్యాయుడు, గ్రామస్తులు, విద్యార్థులు అభినందించారు.

సాదాపురం గ్రామాన్ని దత్తత తీసుకున్న ఐఎంఏ


కరపత్రాలను విడుదల చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆదోని అర్బన్ : మండలంలోని సాదాపురం గ్రామాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దత్తత తీసుకుందని ఆ సంస్థ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అలాగే వ్యాధులు వచ్చిన తర్వాత ఏ డాక్టర్‌ని సంప్రదించాలి, వ్యాధి నిర్ధారణ, అవగాహన సదస్సులు నిర్వహించడం తదితర వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు. ముమ్ముందు ఇంకా కొన్ని గ్రామాలను దత్తత తీసుకోవాలని భావిస్తున్నామని చెప్పారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు కృష్ణమూర్తి, హరీష్, సెక్రటరీ కిరణ్‌కుమార్, గ్రామపెద్ద మురళి పాల్గొన్నారు.

1నుంచి 'జగనన్న సురక్ష'

కౌతాళం: గ్రామాల్లో మిగిలిన ఉన్న సమస్యలకు పరిష్కారం కోసం జూలై 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష పథకం ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గ్రామాల్లో రెండు టీంలుగా పర్యటించి గ్రామస్తులకు కావలసిన సర్టిఫికెట్లు, వన్‌బీ, అండగల్, ఫ్యామిలీ మెంబర్ తదితర ధ్రువ పత్రాలను అందజేస్తామని చెప్పారు. 1వ తేదీన తమ టీం నదిచాగి గ్రామంలో పర్యటిస్తుందని అలాగే ఎంపీడీఓ టీం గుడికంబాలిని సందర్శిస్తారన్నారు. 4న కుంబళనూరు, వల్లూరు గ్రామాల్లో పర్యటిస్తామని, 5న కాత్రికి, హాల్వి, 6న లింగాలదిన్నె, చూడి, 11న బాపురం, చిరుతపల్లి, 12న ఉరుకుంద, రౌడూరు, 13న ఉప్పరహాల్, కామవరం, 18న కుంటనహాల్, పొదలకుంట, 19న బదినేహాల్, సుళేకేరి, 20న ఏరిగేరి, తోవి, 25న కౌతాళం–1,2 సచివాలయ పరిధిల్లో పర్యటిస్తామని, 26న సచివాలయం–3లో సభలు ఏర్పాటు చేస్తామని వివరించారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

కోసిగి: స్థానిక సచివాలయం -1 పరిధిలోని 1వ వార్డులోని బాలుర ఉన్నత పాఠశాల వెనుక భాగం, విద్యుత్ సబ్ స్టేషన్ కాలనీల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్ దళవాయి మంగమ్మ పర్యటించారు. ఆదివారం ఆయా కాలనీలో గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఆయా కాలనీల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలను సమస్యలను ఆరా తీశారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ఆదోని రూరల్ : ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 30వ తేదీన విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని ఆదివారం ఆటోజాతాను కల్లుబావి వార్డులో ప్రారంభించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి అయ్యప్ప, మండల అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ గతేడాది కల్తీ పత్తి విత్తనాలు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నేటివరకు కల్తీ విత్తనాల కంపెనీలపై చర్యలు తీసుకోలేదని, వాటి నుంచి రైతులకు నష్ట పరిహారం ఇప్పించలేదన్నారు. అలాగే అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం ఎకరాకు రూ.50 వేలు నేటివరకు పంపిణీ చేయలేదన్నారు. మండలంలోని ధణాపురం, నారాయణపురం, చాగి, నాగనాథనహళ్లి, బసాపురం, చిన్నహరివాణం, సంతెకూడ్లూరు, పెద్దహరివాణం, బలదూరు తదితర గ్రామాల్లో ఆటో జాతా జరిగింది.

వేతనాలు పెంచాలి

కౌతాళం: గ్రామ సేవకులకు పే స్కేల్ అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని గ్రామ సేవకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సంఘం మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకులు ప్రహ్లాద, రాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎనుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మారెప్ప, అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా హాల్వి వీరేష్, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా మనోహర్, సహయ కార్యదర్శులుగా మంజునాథ్, మంగమ్మ, మరో 11మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్ : పట్టణంలోని రాయ్‌నగర్‌లోని పైకొట్టాల కాలనీకి చెందిన మద్దయ్య కుటుంబ కలహాలతో ఆదివారం పురుగు మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారకస్థితిలో ఉన్న మద్దయ్యను బంధువులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

దళితుల ఫిర్యాదుపై స్పందించండి

కౌతాళం: దళితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు రంగయ్య అన్నారు. ఆదివారం ఆయన రౌడూరు, మండల కేంద్రంలో పర్యటించారు. ఎస్ఐ నరేంద్ర కుమార్‌రెడ్డిని కలిసి దళితుల ఫిర్యాదులపై స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి సమస్యల్ని తెలుసుకుని వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని కలుస్తానని చెప్పారు. మల్లేష్, రాం నరసింహా, దామోదర్, జంబన్న పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

కోసిగి: కర్ణాటక రాష్ట్రం రాజోలి గ్రామంలో మలెఖేడ్ బాబా 13వ ఉరుసును ఆదివారం దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ శాహ ముస్తాఫా ఖాద్రీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు మిట్టామల్కాపురం నిజానంద స్వామి, మటమారి వీరభద్ర శివచార్య, సోమవారపేట రాచోటేశ్వర శివచార్య, అడివేశ్వర మఠ శంబులింగ స్వామి హాజరయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదోని టౌన్ : కాపు, తెలగ, బలిజ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారంస్థానిక ఆస్పరి రోడ్డులోనున్న లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపంలో జరిగింది. ఇందులో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కరణం రంగస్వామి, సెక్రటరీగా చందం మల్లికార్జున, కోశాధికారిగా బండి శ్రీనివాసులు, ఐదుగురు ఉపాధ్యక్షులుగా,జాయింట్ సెక్రటరీలుగా, ఏడుగురినిఈసీ మెంబర్‌లుగా ఎన్నుకున్నారు. సీనియర్ సభ్యులు గోపాలకృష్ణ, అడ్వేకేట్ నాగేంద్రయ్య, కర్నూలు జిల్లా కాపునాడు అధ్యక్షుడు భీమలింగప్ప, మండిగిరి వెంకటేష్, మల్లారెడ్డి, సతీష్, రామాంజనేయులు, చైతన్య, శ్రీను పాల్గొన్నారు.